ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు

5★★

సోమవారం 7 అక్టోబరు 2024

ఘనంగా బతుకమ్మ సంబరాలు 8లో..

కులగణన జరిపి రిజర్వేషన్లు కల్పించాలి
బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి 8లో..

- తెగుళ్ల బెడదతో సతమతం
- దుంప కుళ్లు, ఆకు మచ్చ తెగులు వ్యాప్తి
- దిగుబడిపై ప్రభావం చూపుతుందని బెంగ
- జగిత్యాల జిల్లాలో సుమారు 32 వేల ఎకరాల్లో పసుపు సాగు



జగిత్యాల జిల్లాలో దుంప కుళ్లు, ఆకు మచ్చ సోకిన పసుపు పంట

పసుపు రైతు దిగాలు

జగిత్యాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి, పంట పండిస్తున్న పసుపు రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల పసుపు పంటకు దుంప కుళ్లు, ఆకు మచ్చ తెగుళ్ల సోకడంతో ఆందోళనకు గురవుతున్నారు. తెగుళ్ల బెడద దిగుబడి ప్రభావం చూపనుండడంతో దిగాలు చెందుతున్నారు. పసుపు సాగులో జగిత్యాల జిల్లాది ప్రత్యేక స్థానంగా ఉంది. లాభనష్టాలకు వెరవక ఏళ్లుగా సంప్రదాయ పంటగా ఇక్కడి రైతులు పసుపు వేస్తుంటారు. దాదాపు పుష్కరకాలం తర్వాత గత సీజన్‌లో పసుపు పంటకు రికార్డు స్థాయిలో ధర దక్కింది. దీంతో ఈ ఏడాది రైతులు సాగువిస్తీర్ణం పెంచుకున్నారు. విత్తుకుని మూడున్నర నెలలు పూర్తి కావస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలతో వ్యవసాయ భూముల్లో నీరు నిలిచి తెగుళ్ల వ్యాపిస్తున్నాయి. అధికతేమ కారణంగా దుంప కుళ్లు, ఆకుమచ్చ తెగుళ్ళ కనిపిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ప్రస్తుత సీజన్‌లో జగిత్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 32వేల ఎకరాల్లో రైతులు పసుపు సాగు చేస్తున్నారు. తెగుళ్ల కారణంగా అధిక వ్యయం చేయాల్సి వస్తోందని, దిగుబడిపై ప్రభావం చూపనుందని నిరుత్సాహానికి గురవుతున్నారు. నేల ఎక్కువ రోజులు తేమగా ఉంటే తెగుళ్లతో పంట దెబ్బతింటుందంటున్నారు. అధిక వర్షాలతో మడుల్లో నిలిచిన నీటిని ఎప్పటి కప్పుడు తొలగించాలి. లేనిచోట సమస్య కనిపిస్తోంది. పసుపు పంట సాగు చేస్తున్న రైతులు తెగుళ్ల సోకి నట్లయితే పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికా రులు అంటున్నారు. దుంపకుళ్లు, ఆకు మచ్చ తెగుళ్ల నివారణకు అవసరమైన సూచనలను జగిత్యాల జిల్లా పొలాస ప్రాంతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ బలరాం వివరిస్తున్నారు.

దుంపకుళ్లు లక్షణాలు...నివారణకు ఇలా..

పసుపు పంటలో నీరు నిలిచిపోవడంతో దుంప కుళ్లిపోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దీంతో యాభై శాతం దిగుబడి తగ్గుతుంది. మొక్కలో తొలు త ముదురు ఆకులు వాడిపోయి, గోధుమ రంగుకు మారి ఎండిపోతాయి. తదుపరి మొక్కపై భాగం ఉన్న లేత ఆకులకు వ్యాపిస్తుంది. వేర్లు నల్లబడి కుళ్లి పోతా యి. దుంపలు, కొమ్ములు కుళ్లి మెత్తబడి పోతాయి. శిలీంద్రం వల్ల కాండం కిందిభాగం మెత్తగా మారిపోతుంది. నివారణకు అవసరమైన చర్యలు తీసు కోవాల్సి ఉంటుంది. పంటపై లక్షణాలు కనిపించగానే జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కార్బోసిరాన్ 10జీ గోళీలు ఎకరానికి 10 కిలోలు, ట్రైమాక్సిన్ అను మందు పొడి ఒక కిలో చొప్పున రెండు కలుపుకొని పంటపై చల్లుకోవాలి. యూరియాతో సైతం వీటిని కలుపుకుని వేసుకునే అవకాశం ఉంది.



ఆకు మచ్చ సోకిన పసుపు పంట

ఆకుమచ్చ తెగులు లక్షణాలు, నివారణకు ఇలా...

ఆకు మచ్చ తెగులును మర్రి ఆకు తెగులు అని కూడా అంటారు. ముదురు గోధుమ రంగులో ఉండి ఆకు మొత్తం వ్యాపించి ఎండిపోతుంది. మొదట ఆకులపై చిన్న చిన్న పసుపు రంగు చుక్కలు ఏర్పడుతాయి. క్రమేపీ ఇవి గోధుమ రంగు మచ్చలుగా మార తాయి. తెగులు తీవ్రమైతే మచ్చలు ఎక్కువై ఆకు మాడిపోతుంది. పసుపు దుంప ఎదుగుదల తగ్గి దిగు బడి, నాణ్యత తగ్గిపోతాయి. నివారించ కుంటే కొమ్ము పెరు గుదల ఉండదు. ప్రస్తుత దశలో నివారించ కుంటే పోషకాలు అందక కొమ్ము పెరగదు. దిగుబడులపై ప్రభావం పడుతుంది. నివారణకు ఒక గ్రాము కార్బం డిజం, 2గ్రాముల మాంకోజెట్ మిశ్రమ మందు, లేదా మిల్లీ లీటర్ల ఆజోక్సోబిన్‌ని లీటరు నీటిలో కలిపి రెండు, మూడుసార్లు పంటపై పిచికారి చేయాలని అంటున్నారు.

తెగుళ్ల బెడదతో సతమతం



ప్రస్తుత సీజన్‌లో ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చుకొని పసుపు పంటను సాగు చేస్తున్నాను. ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల పసుపు పంటకు దుంప కుళ్లు, ఆకుమచ్చ తెగుళ్ల సోకాయి. దీని వల్ల సాగు కోసం అధిక వ్యయం చేయాల్సి వస్తోంది. అయినప్పటికీ పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందున్న ఆందోళనతో ఉన్నాము.

\- బండారి వెంకటేశ్, పసుపు రైతు, గ్రామం పెంబెట్ల, జిల్లా జగిత్యాల

జాగ్రత్తలు పాటిస్తే నష్టాన్ని నివారించవచ్చును



పసుపు పంటకు సోకుతున్న దుంపకుళ్లు, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు పలు జాగ్రత్తలు తీసుకుంటే నష్టం తగ్గించవచ్చును. నేల ఎక్కువ రోజులు తేమగా ఉంటే తెగుళ్లతో పంట దెబ్బతింటుంది. అధిక వర్షాలతో మడుల్లో నీరు నిలవ ఉండకుండా చూడాలి. అదేవిధంగా శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలి.

\- బలరాం, సీనియర్ శాస్త్రవేత్త, పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం



కమిషనర్‌కు డాక్యుమెంటరీని అందజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యా కమిషనర్‌కు 70 పేజీల డాక్యుమెంటరీ

జగిత్యాల అర్బన్, అక్టోబరు 6: ప్రాథమిక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటూ 70 పేజీల డాక్యుమెంటరీని రాష్ట్ర విద్యా కమిషనర్ ఆకునూరి మురళికి జిల్లా ఉపాధ్యాయులు ఆదివారం సమర్పించారు. హైదరా బాద్‌లోని స్టేట్ టీచర్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయనకు మడప శ్రీనివాస్ అనే ఉపాధ్యాయులు తయారు చేసిన డాక్యుమెంటరీని అందించారు. ప్రాథమిక పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై రాష్ట్ర ప్రభుత్వం తగు సూచనలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భైరం హరికిరణ్, రాజోజి భూమయ్య, పాలపు శివరామకృష్ణ, చందుపట్ల రమేష్ పాల్గొన్నారు.

ఒకే రాష్ట్రం, ఒకే కార్డుతో బహుళ ప్రయోజనాలు

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 6: ఒకే రాష్ట్రం ఒకే కార్డుతో బహుళ ప్రయోజనాలను పొందవచ్చని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వే స్తుందని అన్నారు. మహిళ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి సంక్షేమ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డును ప్రమాణికంగా తీసుకోని ప్రభుత్వం నుండి వచ్చే ఫలాలను అర్హులైన పేదలకు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి పేద ప్రజలకు రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ కార్డులో ఇంటి మహిళే యాజమాని అని ఒకే కార్డులో రేషన్, ఆరోగ్య, ఇతర పథకాల వివరాలను పొందుపర్చను న్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం అనర్హులకు కూడ రేషన్ కార్డులను మంజూరు చేసి ప్రజాదనం దుర్వినియోగం చేసిందన్నారు. ప్రస్తుతం మాత్రం పక్క పేదలను గుర్తించి అర్హులకు మాత్రమే రేషన్ కార్డులు, హెల్త్‌కార్డులు అన్నిరకాల సంక్షేమ పథకాలను అందించాడానికి సిద్దంగా ఉందన్నారు. ప్రజలు ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కుల బహిష్కరణకు పాల్పడితే చర్యలు

- రత్నాపూర్‌లో విచారణ చేపట్టిన పోలీసులు

మల్లాపూర్, అక్టోబరు, 6 : కుల, గ్రామ బహిష్కరణ ఘటనలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని మల్లాపూర్ ఎస్సై కిరణ్ హెచ్చరించారు. మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన కూచినపల్లి శ్రీనివాస్ కు టుంబాన్ని కుల బహిష్కరణ చేసిన ఘటనపై ఆదివారం పోలీసులు విచారణ చేపట్టారు. కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని కుటుంబ సభ్యులు వాపోయిన సంఘటన పత్రికల్లో రావడంతో పోలీసులు స్పందించారు. దీంతో వివరాలు తెలుసుకున్నట్లు పోలీసులు గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కులం పేరుతో బహిష్కరించడం, కించపరచడం వంటి ఘనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 6: మండలంలోని సత్యక్కపల్లె గ్రామ శివారులో మోర్తడ్ గ్రామానికి చెందిన అండెస్ ప్రవీణ్(40) చెట్టుకు ఉరేసు కుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఇబ్రహీంపట్నం పోలీసులు తె లిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ప్రవీణ్ కొంత కాలంగా కుటుంబ కలహాలతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఆదివారం మోర్తాడ్ నుంచి వచ్చి సత్యక్కపల్లె గ్రామశివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసు కున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ అసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అయితే ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

దూడకు మొదటి పుట్టిన రోజు వేడుకలు



బీర్‌పూర్‌లో దూడకు పుట్టిన రోజు వేడుకలు జరుపుతున్న యజమాని

బీర్‌పూర్, అక్టోబర్ 6 : జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన భైరవేణి సత్యనారాయణకు చెందిన ఆవు దూడకు ఆదివారం మొదటి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. యజమాని సత్యనారాయణ దూడ పుట్టి సంవత్సరం అయిన సందర్భంగా మొదటి పుట్టిన రోజును జరపాలనుకున్నాడు. బంధు మిత్రులను ఆహ్వానించి అందరి సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం అర్చకుల మంత్రోచ్చారణల మధ్య దూడకు శివ అని నామకరణం చేశారు. అనంతరం బంధువులందరికి భోజనాలు ఏర్పాటు చేశారు.

కులవృత్తుల ప్రోత్సాహానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్, అక్టోబరు 6 : రాష్ట్రంలో కులవృత్తుల ప్రోత్సాహానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గీతకార్మికుల రక్షణ కోసమే కాటమయ్య రక్షణ కిట్లు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామంలోని కల్లుగీత కార్మికులకు మంజూరైన రూ. 10 లక్షల విలువ గల 100 కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం జగిత్యాల మండలం ధరూర్ గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జగి త్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామంలో శ్రీ నవశక్తి సేవాస మితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రైతుబిడ్డ అని, గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో సీఎం రే వంత్‌రెడ్డికి అవగాహన ఉందన్నారు. గీత కార్మికులకు రక్షణ కోసం రాష్ట్రవ్యా ప్తం గా రూ. లక్షల 58 వేల మంది కార్మికులను గుర్తించి వారికి ప్రభుత్వం కిట్లు అందజేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కొలుగూరి దామో దర్ రావు, గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు డా. చంద్రశేఖర్‌గౌడ్, జిల్లాసంక్షేమశాఖ అధికారి సాయిబాబా, ఎక్సైజ్‌సీఐ, అధికారులు, గౌడసంఘం నాయకులు బాలు గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మండలనాయకులు నక్కలరవీంధర్‌రెడ్డి, మల్లేశం, ఆదిరెడ్డి, రాజిరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.



గీతాకార్మికులకు కాటమయ్య రక్షణకిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వైభవంగా దేవీ నవరాత్రోత్సవాలు

- శాకాంబరి రూపంలో దర్శనం ఇచ్చిన అమ్మవారు
- సూర్యప్రభ వాహనంపై స్వామి వారల ఊరేగింపు

ధర్మపురి, అక్టోబరు 6 : ధర్మపురి లక్ష్మీ నృసింహ స్వామి అనుబంధ శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయంలో దేవి నవరాత్రోత్సవాలు నాలుగో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేదపారాయ ణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారలు నాలగవ రోజు మల్లె పూలు, బిల్వ పత్రి దండలు ధరించి, గోధుమ రంగు వస్త్ర అలంకరణతో కూష్మాండ, శాకాంబరీ రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. సాయంత్రం శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారల సేవలు పుర వీధుల గుండా సూర్యప్రభ, చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. సాయంత్రం అమ్మ వారలకు షోడషోపచార పూజతోహారతి, మంత్రపుష్పం, కన్యకాపూజ, ముత్తైదువల లలిత సహస్ర నామ పారాయణంతో తీర్థప్రసాద వితరణ జరిపారు. ఇదిలా ఉండగా నవ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారలకు ప్రత్యేక పూజలు, చిన్న పిల్లలకు చిత్ర లేఖనం పోటీలు, రాత్రి వేళలో భరత నాట్యం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.



ధర్మపురిలో



కొండగట్టులో..

కొండగట్టులో కుష్మాండ అవతారంలో దేవి..

మల్యాల, అక్టోబరు 6: కొండగట్టు అంజన్న సన్నిధిలో జరుగుతున్న దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు ఆదివారం అమ్మవారు కుష్మాండ అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రుణ మాఫీ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, అక్టోబరు 6: ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పంటరుణాల మాఫీ చేసిందని ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని పోతారంలో నిర్మించిన వ్యవసాయ సహకార సంఘం నూతన భవనాన్ని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టీ.జీవన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో బీజేపీతో పాటు ఏ ఇతర పార్టీల ప్రభుత్వాలు అమలు చేయని పంట రుణాల మాఫీ ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వాలు మాత్రమే చేస్తూ రైతులకు అండగా ఉంటున్నాయిని అన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం పంట రుణాల మాఫీ చేసిందని కొంత సాంకేతిక సమస్యలు ఎదురవడంతో కొంత ఆలస్యం అవుతుందన్నారు. త్వరలోనే పూర్తి స్థాయిలో రుణమాఫీ అవుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం విడతల వారిగా లక్ష రుణమాఫీ చేయగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తుండడంతో కొంత జాప్యం అవుతున్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రుణమాఫీకి కట్టుబడి ఉంది అన్నారు. పెద్ద ఎత్తున పంట రుణమాఫీకి నిధుల సమీకరణతో రైతు భరోసా ఇవ్వలేక పోయామని పూర్తి స్థాయిలో రుణమాఫీతో పాటు రైతుభరోసాను త్వరలోనే రైతులకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్‌లు అయిల్నేని సాగర్‌రావు, రాంలింగారెడ్డి, మధుసూదన్‌రావు, వైస్ చైర్మన్ కిషన్‌రెడ్డి పాలకవర్గం సభ్యులు నాయకులు పాల్గొన్నారు



సింగిల్‌విండో భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

- నూతన భవనం ప్రారంభం

పోతారంలో నూతనం సింగిల్‌విండో భవనాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పోతారం సింగిల్‌విండో పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ధాన్యం కొనుగోల్లతో సహకార సంఘాలకు పునరుజ్జీవం వచ్చిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. సంఘం ప్రగతి నివేదికను చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొండప లక్ష్మల రామ్మోహన్‌రావు సీఈవో కమటం గంగాధర్, నాయకులు ఆదిరెడ్డి, ఆనంద రెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, వేణురావు, సత్యంరావు, జగన్, నల్ల తిరుపతిరెడ్డి, నక్క అనిల్ రైతులు పాల్గొన్నారు

నిరుపేదలకు ఉచిత కంటి శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స చేయించుకున్నవారితో ఎమ్మెల్యే

జగిత్యాల అర్బన్, అక్టోబరు 6 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని పావని కంటి ఆస్పత్రిలో ఆపి, రోటరీ క్లబ్ జగిత్యాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేత్ర చికి త్స శిబిరంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ 17 మంది నిరు పేదలకు ఉచిత చికిత్స చేశారు. అనంతరం వారికి ఉచిత మందులు, కంటి అ ద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, నాయకులు సత్తిరెడ్డి, ఏనుగుల రాజు, మాజీ సర్పంచ్ నారాయణ రావు పాల్గొన్నారు.

- నీట్ ఆల్ ఇండియా 3400 ర్యాంక్, తెలంగాణలో 42వ ర్యాంక్ సాధించి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో ఎంబీబీఎస్ సీటు పొందిన జగిత్యాల ము న్సిపల్ కౌన్సిలర్ కప్పల శ్రీకాంత్ కుమారుడు చంద్రహాస్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అభినందించారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 6: కరీంనగర్‌లోని కార్ఖానగడ్డ ప్రాంతంలో శనివానం అర్ధరాత్రి సమయంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 2కిలోల 94 గ్రాముల నిషేధిత గంజాయిని పట్టుకున్నామని మూడో రాణా సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. కార్ఖానగడ్డ వ్యవసాయ మార్కెట్ ప్రాంతంలో పెట్రోలింగ్‌లో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులకు ఒక వ్యక్తి అనుమానాస్పదంగా వ్యవహరిస్తూ పారిపోయేందుకు ప్రయత్నించగా అతన్ని పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకు న్నారు. అనంతరం అతని, బైక్‌లో తనిఖీ చేయగా నిషేధిత గంజాయి పట్టుబడింది. నిందితుడు నిజామాబాద్ ముజాహిద్ నగర్‌కు చెందిన ఎండీ ఉస్మాన్(33) గంజాయి విక్రయిస్తుంటాడని విచారణలో వెల్లడైనట్లుగా సీఐ తెలిపారు. నిజామాబాద్ నుంచి కరీంనగర్‌కు బైక్‌పై వచ్చి ఇక్కడే ఒక వ్యక్తికి గంజాయిని విక్రయించేందుకు రాగా పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించా డని తెలిపారు. నిందితుడి వద్ద లభించిన గంజాయితోపాటు బైక్, సెల్‌ఫోన్‌ల ను సీజ్ చేసి, నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు.

130 క్వింటాళ్ల రేషన్ బియ్యం..

కరీంనగర్ క్రైం, అక్టోబరు 6: కరీంనగర్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం చొప్పదండి మండలం ఆర్నకొండ వద్ద ఒక డీసీఎం వ్యాన్‌ను తనిఖీ చేయగా 130 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ప్రభుత్వం ఉచితంగా పేదలకు పంపిణీ చేసిన పీడీఎస్ బియ్యంను తక్కువ ధరకు కొనుగోలు చేసిన కొందరు దుబ్బపల్లి నుంచి మహారాష్ట్రలో ఎక్కువ ధరకు విక్రయించేందుకు తరలిస్తుండగా పట్టుబడిందని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు తెలిపారు. డీసీఎం వ్యాన్‌లో 130 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యంను తరలిస్తున్న కరీంనగర్ ఆటోనగర్‌కు చెందిన సిరిగిరి మోసెస్, మహారాష్ట్ర సిరివంచకు చెందిన విరన్, హన్మకొండ జిల్లా శాయంపేటకు చెందిన విజేందర్‌పై కేసు నమోదు చేశామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ ప్రభాకర్, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మికాంత్, సివిల్‌సప్లైయ్ ఆఫీసర్ ఉష తదితరులు తెలిపారు.

బస్సు నడుపుతుండగా డ్రైవర్‌కు గుండెపోటు

● ఆస్పత్రికి తరలించిన కండక్టర్, ప్రయాణికులు ● చికిత్స పొందుతూ మృతి

హుజూరాబాద్/సైదాపూర్, అక్టోబరు 6: కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఠాగూర్ రమేష్ సింగ్(46) విధులు నిర్వహిస్తుండగా మార్గమధ్యలో గుండెపోటుకు గురయ్యాడు. గమనించిన కండక్టర్, ప్రయాణికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఠాగూర్ రమేష్‌సింగ్ హుజూరాబాద్ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఆయన హుజూరాబాద్ డిపో నుంచి హైదరాబాద్‌కు బస్సు నడుపుకుంటూ వెళ్తుండగా, సిద్దిపేట జిల్లా గౌరారం స్టేజీ వద్దకు రాగానే గుండెలో నొప్పి వస్తుందని కండక్టర్, ప్రయాణికులతో తెలిపి బస్సును పక్కకు నిలిపివేశాడు. వెంటనే ప్రయాణికులు 108కు సమాచారం అందించి గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.



ఠాగూర్ రమేష్‌సింగ్(ఫైల్), లింగమూర్తి (ఫైల్)

రమేష్‌సింగ్ బస్సు నడుపుతున్న సమయంలో సుమారు 40మంది ప్రయాణికులు ఉన్నారు.

● విధి నిర్వహణలో కండక్టర్ మృతి..

చిగురుమామిడి: మండల కేంద్రానికి చెందిన రాకం లింగమూర్తి (55) అనే కండక్టర్ విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. కరీంనగర్-2 డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కరీంనగర్ బస్టాండ్‌కు వచ్చి తన విధులు నిర్వహిస్తున్న క్రమంలో గుండెపోటు వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు అనేక సంవత్సరాలుగా సీపీఐ సానుభూతిపరుడిగా కొనసాగుతున్నాడు. అతన మృతిపై సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో లింగమూర్తి మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ టీడీపీ నాయకులు మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

● విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతిచెందిన కండక్టర్ రాకం లింగమూర్తి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మానకొండూర్, అక్టోబరు 6: మండలంలోని కెల్లేడు గ్రామానికి చెందిన కాట వెంకటేశ్ (35) అనే యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానిక సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కెల్లేడు గ్రామానికి చెందిన వెంకటేశ్ తండ్రి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తండ్రి లేడనే బాధతో మద్యానికి బానిసై ఈ నెల 4న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడు వెంకటేశ్ భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



కాట వెంకటేశ్ (ఫైల్)

చెరువులో
గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇల్లందకుంట, అక్టోబరు 6: మండలంలోని బూజూనూర్ గ్రామచెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందినవారు బతుకమ్మ చెరువు సమీపంగుండా ఆదివారం వెళ్తుండగా చెరువులో మృతదేహం కనబడింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి 35-45సంవత్సరాల వయస్సు ఉంటుంది. కుడి చేతికి స్టీల్ కడెం, చామన్‌చాయ రంగుతో పాటు బ్లూ కలర్ ఫుల్ టీషర్ట్ ఉంది. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజకుమార్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినట్లయితే 8712670778 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి

మానకొండూర్, అక్టోబరు 6: మండలంలోని కెల్లేడు గ్రామ శివారులో విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టేందుకు విద్యుత్ స్తంభం ఎక్కిన అసిస్టెంట్ లైన్‌మెన్ జోగు నరేష్ విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెందాడు. కొండపల్కల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కెల్లేడు గ్రామ శివారులో 33బై11 కేవి విద్యుత్ లైన్ పనులను మరమ్మతు పనులు చేసేందుకు ఆదివారం విద్యుత్ స్తంభం ఎక్కాడు. విద్యుత్ సరఫరా కొనసాగుతుండడంతో విద్యుదాఘాతంతో స్తంభం పైనుంచి పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



నరేష్ (ఫైల్)

దైవ దర్శనానికి వెళ్తూ అనంతలోకాలకు..

- ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 6: మండలంలోని దేవునిపల్లి లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భార్యతో కలిసి వెళ్తున్న క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వేముల లక్ష్మయ్య(58) తన భార్యతో కలిసి ఆదివారం దేవునిపల్లి లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అందుగులపల్లి గ్రామ స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా గోదావరిఖని నుంచి పెద్దపల్లి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. లక్ష్మయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందగా, అతడి భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు లక్ష్మయ్య భార్య వేముల మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మయ్య (ఫైల్)

గోవా రైలుకు పచ్చజెండా

సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన.. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.



వాస్కో డ గామా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది. అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.

తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
- కథ-2023 సంకలనం ఆవిష్కరణ
- కథ కాల స్థితిగతులను రికార్డు చేస్తుంది: ప్రముఖ కవి శివారెడ్డి
- అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్: వాసిరెడ్డి

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు. కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీస్‌ను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త ముద్వా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.



కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, చిత్రంలో ప్రముఖ కవి కే శివారెడ్డి తదితరులు

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

హనుమకొండ జిల్లాలోని ఓ పత్తి చేనులో దుర్ఘటన .. ఇంటర్ విద్యార్థిని, యువ రైతు మరణం

ఐనవోలు/నెల్లికుదురు/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురువగా.. పిడుగుపాటు వల్ల హనుమకొండ జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థిని సహా ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురానికి చెందిన కుకట్ల రాజుయాదవ్ (25) దౌతుబాజి శ్రావణి(17), కుకట్ల కోమల(రాజుయాదవ్ తల్లి) సహా ఏడుగురు కలిసి గ్రామ శివారులోని పత్తి చేనులో పత్తి ఏరుతున్నారు. అయితే, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భారీ వర్షం పడడంతో అందరూ సమీపంలోని ఓ రేకుల షెడ్డు కిందకి వెళ్లారు. పది నిమిషాల వ్యవధిలో ఆ షెడ్డుపై పిడుగుపడగా అంతా స్పృహ కోల్పోయారు. కాసేపటికి తేరుకున్న కొందరు ఇతరులను లేపేందుకు ప్రయత్నించగా రాజుయాదవ్, శ్రావణి ప్రాణాలు కోల్పోయారు. రాజుయాదవ్ తల్లి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శ్రావణి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. యువ రైతు అయిన రాజు అవివాహితుడు. ఇక, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే క్యాంపు కార్యాలయంలో ఇంజనీర్‌గా పని చేస్తున్న ఆర్.సింగారం సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. సింగారం స్వస్థలం తమిళనాడులోని వెల్లూరు.. మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింగారం పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.



రాజుయాదవ్



శ్రావణి (ఫైల్)

నేడు, రేపు వర్షాలు..

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, జనగాం, హనుమకొండ, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, జనగాం, వరంగల్, యాదాద్రి జిల్లాలకు సోమవారం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా, ఆదివారం జనగామలో 3 సెంటీమీటర్ల వర్షపాతం కురవగా, భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఘనంగా శరన్నవరాత్రోత్సవాలు

కోరుట్ల/కోరుట్ల రూరల్ అక్టోబరు 6 : పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో శరన్నవరాత్సోవాలు ఆదివారం ఘనంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని అన్ని దేవాలయాలలో శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పట్టణంలోని కోటి నవదుర్గ, దుర్గాదేవి, తిశక్తి, సరస్వతి, దేవాలయాలలో అమ్మవారు కూష్మాండ వాహనం ద్వారా దర్శనం ఇచ్చింది. అష్టలక్ష్మి దేవాలయంలో స్వామి వారు శేష వాహనం, వెంకటేశ్వర స్వామి దేవాయాలలో స్వామి వారు హంస వాహనంపై దర్శనం ఇచ్చారు. మహిళలు మంగళ హరతులతో స్వాగతం పలికారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామాలలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. పలు గ్రామాలలోని మండపాల వద్ద కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మెట్‌పల్లి టౌన్: పట్టణంలోని పలు వార్డులలో దుర్గదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డులలోని మండపలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకలు నిర్వహించారు. పట్టణంలోని పటేల్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమత మండపం వద్ద కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక పూ జలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రాంబాబు, హన్‌మాన్ నగర్ దుర్గ మండప నిర్వహకులు పాల్గొన్నారు.

గొల్లపల్లి : గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న శ్రీ దుర్గా శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు ఆదివారం దుర్గా దేవి భక్తులకు కూశ్మాండ అవతారంలో దర్శనమిచ్చింది. అనంతరం పలు గ్రామాల్లో దాతల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి నాలుగవ రోజు ఆదివారం గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవికి ఆలయ పూజారి భాస్కర్ అభిషేకం, కుంకుమార్చన, మహా చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో హన్మాన్ సేవా సమితి సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

రాయికల్: దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం కొనసాగాయి. రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో దుర్గాదేవి మంటపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఆలూరు నవదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో, మైతాపూర్ గ్రామాల్లో దుర్గమ్మకు భక్తులు బోనాలు సమర్పించారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. రాయికల్ సంఘ మిత్ర శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గాదేవి మండపం వద్ద ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మల్యాల: దుర్గాదేవి నవరాత్రోత్సవాల్లో బాగంగా మల్యాలతో పాలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి మంటపాలలో బోనాల వేడుకలు, కుంకుమపూజలు నిర్వహించారు. ముత్యంపేటలో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వెల్గటూరు: వెల్గటూర్ మండల కేంద్రంలో నవదుర్గ సేవ సమితి ఆధ్వర్యంలో నెలకొల్పిన అమ్మవారు ఆదివారం శ్రీ కుష్మాండ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారిని బంగారు రంగు చీరతో అందంగా అలంకరించారు. వివిధ రకాల కూరగాయలను దండగా మార్చి అమ్మవారిని ఆకర్షణీయంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.






కోరుట్ల, గొల్లపల్లి, కొడిమ్యాల, పెగడపల్లిలో వివిధ రూపాల్లో దర్శనం ఇస్తున్న అమ్మవారు



శేష వాహనంపై ఊరేగుతున్న స్వామి వారు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న జువ్వాడి నర్సింగరావు

కార్మికులకు దుస్తులు పంపిణీ

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 6: దసరా పండుగను పురష్కరించుకుని ఆదివారం మున్సిపల్ కార్మికులందరికి నితన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత-సత్యానారయణలు నూతన బట్టలను పంపిణీ చేశారు. సుజాత-సత్యనారాయణ మాట్లాడుతూ మున్సిపల్ చైర్ పర్సన్ అయినప్పటి నుంచి కార్మికులందరికి దసరా కానుకగా దుస్తులను ఇస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లుగా దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు అంగడి పురుషోత్తం, ఒజ్జెల బుచ్చిరెడ్డి, లంక గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్య పూజలతోనే లక్ష్యం చేరుకుంటాం

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 6 : భగవంతుడిని నిత్యం పూజించడం, ఆయన సేవలో పాల్గొనడంతోనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని సింగరకొండ మాత శారదానంద భక్తులకు ప్రవచనం చేశారు. మండలంలోని వేంపేట గ్రామంలోని రామకృష్ణ సంకీర్తన మండలి ఆధ్వర్యంలో సత్యానంద మహర్షి పుణ్య ఆరాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరకొండ మాత శారదానంద కార్యక్రమంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆదివారం సంకీర్తన మండలిలో పూజ కార్యక్రమాలను జరిపారు. సత్యానంద మండలి వ్యవస్థాపకులుగా జంగి రాజమల్లయ్య ఆధ్వర్యంలో సభ్యులు భగవద్గీత ఉపన్యాసాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారంపల్లి శ్రీనివాస్, మర్రి బాస్కర్, గాజంగి రామకృష్ణ, చిన్న వెంకటి, నర్సయ్య, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

గొల్లపల్లి, అక్టోబరు 6 : మండల కేంద్రంలోని రెడ్డి సంఘం భవనంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్కు కరుణాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. శిబిరం విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని, అలాగే ఉచిత వైద్య శిబిరంను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా లింగారెడ్డి

జగిత్యాల అర్బన్, అక్టోబరు 6: జగిత్యాల పట్టణంలోని విద్యానగర్ (మైసమ్మగడ్డ) మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోస్కుల లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాచమల్ల రాజేందర్, కోశాధికారిగా అలి శెట్టి శంకర్, ఉపాధ్యక్షులుగా ఇప్ప హరీష్, సహాయ కార్యదర్శిగా కొక్కు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులుగా కట్ట రాజేందర్, జంగిల్ ధర్మేందర్, డిండిగాల శ్రీనివాస్, కాశెట్టి మధుకర్, సుంకరి రవి, సిద్ధం మురళి, చీర్నేని శేఖర్, గోపు రాజేష్‌లను ఎన్నుకున్నారు.

విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 6: రాష్ట్రంలో గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఇప్పుడు ప్రజాపాలన ప్రభుత్వం విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి బలోపేతం చేయాలని సుఖీభవ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు బొక్కెనపల్లి నాగరాజు కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలకు పూర్తి స్థాయి వీసీలను నియమించాలని ప్రభుత్వం విద్యా కమిషన్‌కు పూర్తి బాధ్యతలు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. యూనివర్సిటీలలో చదువుతున్న విద్యార్థులకు ఫీజుల పేరుతో వేధించకుండ చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల విద్యాలయాలను సందర్శించి పటిష్టం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురకుల పెరేంట్స్ కమిటీ సెక్రటరి తరిస్వామి, రెవెన్యూ డివిజన్ సాధన కమిటి నాయకులు నాంపల్లి గట్టయ్య, లక్ష్మణ్, శోభన్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్, అక్టోబరు, 6: మండలంలోని నగునూర్ గ్రామంలో రాజ్యాంగా నిర్మాత డాక్టరు బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్‌రెడ్డి, శోభన్, సుధాకర్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

దుర్గాదేవి బోనాల ఉత్సవం

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 6 : మండలంలోని వెల్లుల్ల గ్రామంలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి బోనాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని భక్తులు భక్తి శ్రద్ధలతో బోనం తయారు చేశారు. అనంతరం పుర వీధుల గుండా మహిళలు బోనాలతో ఊరేగింపుగా గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాలకు చేరుకున్నారు. అమ్మ వారికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు జరిపి ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. దుర్గాదేవి దీక్షపరులు, పాల్గొన్నారు.

కులగణన జరిపి రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి

మల్లాపూర్, అక్టోబరు, 6 : ప్రభుత్వం కుల గణన జరిపి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అవకాశం కల్పించాలని బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంఆర్ ఫంక్షన్‌హాల్లో నిర్వమించిన బీసీ జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల కోసం ఈనెల 9న మెట్‌పల్లిలో నిర్వహించే సత్యాగ్రహ దీక్షలో పార్టీలకతీతంగా బీసీలు పాల్గొని బీసీ ఐక్యతను ప్రభుత్వానికి చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు గజ్జి గంగారెడ్డి, బోయిని హన్మండ్లు, నల్ల రాజేందర్, మొరపు గంగారాజం, గజ్జి రాజారెడ్డి, బొక్కల నాగరాజు, గజ్జి రమేష్, మహమ్మద్ రఫీ, సిరిపురం రవీందర్, ముద్దం సత్యనారాయణగౌడ్, శరత్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, లింగ స్వామిగౌడ్, చిట్యాల లక్ష్మణ్, పాల్గొన్నారు.

పల్లకీ సేవ సజావుగా జరిగేందుకు సహకరించాలి

ఎస్సైని కోరిన వెల్లుల్ల గ్రామస్థులు



ఎస్సైకి వినతిపత్రం అందజేస్తున్న వెల్లుల్ల గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 6 : దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వెల్లుల్ల గ్రామంలో నిర్వహించే దేవుని పల్లకి సేవ(శావ)ను సజావుగా జరగడానికి సహకరించాలని గ్రామస్థులు స్థానిక ఎస్సైని కోరారు. ఆదివారం మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఎస్సై చిరంజీవికి వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు. ఏళ్ల నుంచి గ్రామంలో శావ కార్యక్రమం నిర్వహించడం అనవాయితీగా వస్తోందన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఈనెల 4 నుంచి శావ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా శావ కార్యక్రమం సజావుగా జరిగడానికి సహకరించాలని పోలీసులను గ్రామస్థులు కోరారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, ప్రతి ఒక్కరికి ఎల్లపుడు సహకారం అందిస్తామని ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

● విజేత జట్టుకు కప్పు అందజేసిన డీఎస్పీ



కప్పు అందజేసిన అనంతరం జట్లతో డీఎస్పీ

మల్యాల, అక్టోబరు 6: మల్యాల క్రాస్‌రోడ్డు వద్ద మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎం.ఎస్ వారియర్స్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ టోర్నీలో డీఎస్‌ఎం-03 జట్టు విజేతగా రన్నర్‌గా వన్ ఆసుపత్రి జట్టు నిలువగా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ కప్పు అందజేశారు. జట్ల సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ నీలం రవి, ఎస్సై ఏ.నరేశ్‌కుమార్, ఆర్గనైజర్ మిస్త్రీ శ్రీనివాస్ పాల్గొన్నారు

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

కోరుట్ల రూరల్, అక్టోబరు 6 : మండలంలోని పైడిమడుగు గ్రామంలో కోరుట్ల లయన్స్ క్లబ్, కోటి నవదుర్గ మహిళ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన శిబిరంలో గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ స్టార్ యూత్ వెల్ఫేర్ అసోసియేషనన్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 35 యూనిట్ల రక్త దాతలు రక్తం దానం చేయగా భద్రపరిచి జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. సహకారం అందించిన ఫ్రెండ్స్ స్టార్ యూత్ వెల్ఫేర్ సభ్యులను లయన్స్ క్లబ్ సభ్యులు అభినందించి సన్మానించారు. రక్తదానం చేసిన వారి ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ సభ్యులు కుందారపు మహేందర్, పోతని ప్రవీణ్ కుమార్, జగన్, మహిళ క్లబ్ సభ్యులు పేమలత, పోతని లత, యూత్ సభ్యులు కోమ్ముల జగపతి, మర్రిపల్లి నరేష్, బోగ నవీన్, మరిపల్లి అనిల్, కటకం వినయ్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో దసరా జరుపుకోవాలి

పెగడపల్లి, అక్టోబరు 6 : దసరా పండుగ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మల్యాల సీఐ నీలం రవి పేర్కొన్నారు. నంచర్ల గ్రామంలో ఆదివారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో బాగంగా పెగడపల్లి ఎస్.ఐ సీహెచ్. రవికిరణ్‌తో కలసి రామాలయం సమీపంలో గ్రామస్థులతో బతుకమ్మ దసరా పండుగపై సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ 12న జరుపకునే విజయదశమి వేడుకలను స్నేహపూర్వ కంగా జరుపుకోవాలని, ఎలాంటి అల్లర్లకు తావు ఇవ్వకూడదని సూచించారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



ధర్మపురిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కోరుట్ల బస్టాండ్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 6: పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో ఆదివారం డీ ఎం టి. దేవరాజు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. బస్టాండ్‌లో బతుకమ్మను పేర్చి ఆటపాటలతో బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేల అతిపెద్ద బతుకమ్మను తయారు చేశారు. రంగురంగుల పూలతో బతుకమ్మను అలంకరించి ప్రయాణికులతో కలిసి ఆటపాటలు ఆడారు. డీఎం దేవరాజు, సిబ్బంది నాగేష్, రాఘవ, నాగన్న, శ్రీను, మహిళ కండాక్టర్‌లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలో బతుకమ్మ ఉత్సవాలు ఐదవ రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా క్షేత్రంలోని వివిధ వీధుల్లో, గోదావరి నది వద్ద అనేక మంది మహిళలు, యువతులు, చిన్నపిల్లలు రక రకాల పూలతో పేర్చి, అందంగా అలంకరణ చేసిన బతుకమ్మలను ఒక చోట ఉంచారు. అనంతరం మహిళలు, యవతులు, చిన్న పిల్లలు సాంప్రదాయ రీతిలో తెలంగాణ జానపద, బతుకమ్మ, గౌరీ దేవి పాటలు పాడుతూ ఆటలు ఆడారు. రాత్రి వేళలో బతుకమ్మలను వాడలో ఏర్పాటు చేసిన గుంతలు, కోనేరు, గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. అలాగే మండలంలోని అనేక గ్రామాల్లో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు.

కోరుట్ల : పట్టణంలోని ఆర్‌టీసీ బస్టాండ్ అవరణలో కోరుట్ల డిపో పరిధిలోని మహిళ కండక్టర్లు, సిబ్బంది బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. వివిధ రకాల పూలు, కలర్ పేపర్లతో తయారు చేసిన బారీ బతుకమ్మను అలంకరించి బస్టాండ్ ప్రాంగణలో ఉంచి వేడుకలను నిర్వహించారు. బతుకమ్మ పాటలు పాడి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌టీసీ బసాండ్ ప్రాగణం వేడుకలతో సందడిగా మారింది. ఆర్‌టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

మల్యాల: మండలంలో బతుకమ్మ సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. మల్యాలలో ఆదివారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని సంప్రదాయంగా బతుకమ్మ ఆడారు. ఆట, పాటలతో వేడుకగా బతుకమ్మ జరుపుకున్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

మల్యాల, అక్టోబరు 6: మండలంలోని ముత్యంపేటలో ఆదివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హైమాస్ట్‌లైట్లను ప్రారంభించారు. అంతకు ముందు బడుగుబలహీన వర్గాల సామాజిక అభ్యున్నతికై నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. బలహీన వర్గాల ప్రజలు ఉన్నతంగా ఎదిగేందుకు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నాయకులు దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మ్యాక లక్ష్మన్, సంత ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు ఇటీవలే మోకాలి శస్త్రచికిత్స చేయించు కున్న రామన్న పేట మాజీ సర్పంచ్ వెల్మ లక్మారెడ్డిని పరామర్శించారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

మల్లాపూర్, అక్టోబరు, 6 : మండలంలోని సిర్పూర్ సొసైటీ అధికారుల తీరుపై మండిపడుతూ పాలక వర్గం చేపట్టిన దీక్ష రెండో రోజు కొనసాగింది. ఆదివారం సొసైటీ ఆవరణలో చైర్మన్ అంజిరెడ్డి, వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. గతంలో సొసైటీలో విధులు నిర్వహించిన సీఈవో డబ్బులు వాడుకోవడంతో అతని ఆస్తులను పాక్స్‌కు అటాచ్ చేసి బకాయిలు చెల్లించాలని నిర్ణయం తీసుకుందన్నారు. అతని ఆస్తులను గత సంవత్సరం పాలక వర్గం వేలం వేసిందన్నారు. వేలంలో భూములు దక్కించుకున్న వారికి నేటికి రిజిస్ట్రేషన్ కాక పోవడంతో ఖాతా దారులకు డబ్బులు చెల్లించడంలో అధికారుల విఫలమయ్యారన్నారు. అధికారుల నిర్లక్ష్యం దోరణికి విసుగెత్తి నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు.

నూలు డిపో మంజూరుపై క్షీరాభిషేకం



సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పద్మశాలీలు

కథలాపూర్, అక్టోబరు 6 : రాష్ట్ర ప్రభుత్వం వేములవాడ కేంద్రంగా నూలు డిపోను మంజూరు చేస్తూ రు. 50 కోట్లు విడుదల చేయడం పట్ల మండల కేంద్రంలో పద్మశాలీలు సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే చిత్రప టాలకు క్షీరాభిషేకం చేశారు. నూలు డిపో ఏర్పాటు వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి అవకాశాలు కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. నేత కార్మికులు పెట్టుబడిదారుల పై ఆధార పడకుండా నేరుగా ఉపాధి లభించేందుకు ఆస్కారం ఏర్పడనుందని అన్నారు. మరమగ్గాలకు అవసరమయ్యే నూలును టెస్కో క్రెడిట్ పద్ధతిలో కార్మికులకు వస్త్రాన్ని సరఫరా చేయడానికి వీలు కలుగుతుందని చెప్పారు. రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పులి హరిప్రసాద్, మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుండేటి సురేశ్, ప్రధాన కార్యదర్శి వంగరి రాజారాం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, చెదలు సత్యనారాయణ, గంగాధర్, లింగారావు, పాల్గొన్నారు.

భీమారం: వేములవాడలో నూలు డిపో ఏర్పాటును మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు ఆదివారం భీమారం మండల కేంద్రంలో పద్మశాలి సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ డిపో వల్ల 30 వేల మరమగ్గాల కార్మికులకు నేరుగా పని దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుండేటి రాజేందర్, ద్యావనపెల్లి సుధీర్, రాకేష్, రంజిత్, శివ, శ్రీనివాస్, గంగారాం, సాయిరాం, సురేష్, శేఖర్, ప్రేమ్, కాంగ్రెస్ నాయకులు నరేష్, శంకర్‌గౌడ్, స్వామిరెడ్డి, ప్రశాంత్, శ్రీనివాస్‌గౌడ్, కర్నేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో పూర్వ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏళ్ల తరువాత పాత మిత్రులు అందరూ ఒక చోట కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగ క్షేమాలు తెలుసుకున్నారు. వారు చదువుకున్న రోజుల్లో మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుని అలనాటి రోజులను మళ్లీ గుర్తుకు తెచ్చుకున్నారు. వారికి చదువు చెప్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాత మిత్రుల్లో పేదరికంలో ఉన్న వారిని ఆదుకునేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. అనంతరం అందరూ ఒక చోట భోజనాలు చేసి సందడి చేసారు.

-ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్



రాయికల్ మండలం భూపతిపూర్‌లో 2003-04 పదోతరగతి బ్యాచ్



జగిత్యాల జిల్లా కేంద్రంలోని గీతా విద్యాలయంలో 2004-2005బ్యాచ్



కొడిమ్యాలలో 2013-2014 పూర్వ విద్యార్థులు



బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ 2004-2005 పదో తరగతి బ్యాచ్



ఇబ్రహీంపట్నం మండలం గోదూర్‌లో 1989-90 పదోతరగతి బ్యాచ్